
హాస్య కథ

# అతడు... ఆమె... అది...



నాయుని కృష్ణమూర్తి

**'ఖణేల్... ఖణేల్...'** ఏదో తవ్వుతున్న శబ్దం.

వెంకట్రావు నిద్ర లేచాడు. టైము చూసుకుంటే పన్నెండు దాటింది. భార్యను లేపాడు. కమలమ్మ ఉలిక్కిపడి లేచింది కళ్లు నులుముకుంటూ.

"మిడ్‌నైట్ మసాలా చూడడం అయిపోయిందా?' అంది గోముగా.

'నీ మొహం తగలెయ్యా మిడ్‌నైట్ మసాలా చూసి నిన్నెందుకు నిద్రలేపుతానే! ఏ సౌందర్యనో కల్లోకి రమ్మని రిక్వెస్ట్ చేసి పడుకోనా?'

'ఆ సౌండ్ ఏమిటండీ పెరట్లో... దొంగాడేమో.... మనింటికి కన్నం వెయ్యడంలేదు కదా!"

"అందుకే నిన్ను లేపింది. వాడు కన్నం వేసి ఇంట్లోకి వచ్చాడంటే ఏమెత్తుకు పోతాడంటావు?'

'ఏమెత్తుకు పోతాడంటారేమిటండీ... బీరకాయ ఒక్కొక్కటి పదమూడు రూపాయలు పెట్టి ఎనిమిది కొన్నాను. చవగ్గా వస్తున్నాయి కదా అని టొమాటోలు కిలో నలభై రూపాయల లెక్కన నాలుగు కిలోలు కొన్నాను. నా మతిమరుపుమండా... మంచినీళ్ల క్యాన్లు రెండు బాత్రూం దగ్గర పెట్టానండీ. అవెత్తుకు పోయాడంటే...' ఏడుపు లంకించుకొంది కమలమ్మ.

'ష్..' అని హెచ్చరించాడు వెంకట్రావు. 'తొందరపడి మనం ఎవర్నీ దొంగ లనుకోనక్కర్లేదు. జన్మభూమి కార్యక్రమంలో గాని, పనికి ఆహారపథకంలోగాని మన పెరట్లో కాలువ ఏదైనా సి.యం.గారు తవ్విస్తున్నారేమో...'

'నిజమేనండీ... ముండావాడు నా మంచినీళ్లక్యాన్లు ఎత్తుకుపోవడానికి వచ్చాడేమోనని పొరబాటున అనుకొన్నాను... తప్పు తప్పు. మీరన్నట్టు జన్మభూమి, పనికి ఆహారపథకమే కాకుండా ఇంటింటా ఇంకుడు గుంతలు తవ్వమన్నారు కదా... మనమా పనిచెయ్యలేదని ప్రభుత్వం వాళ్లు మన పెరట్లో ఇంకుడుగుంతను తవ్విస్తున్నారేమోనండీ...'

'అలాంటిదే ఏదో ఒకటి అయుంటుంది. ముందు నువ్వెళ్లి పెరట్లో ఏం జరుగుతోందో వెళ్లి చూసిరా.'

కమలమ్మ మొగుడివంక ఎగాదిగా చూసింది. 'మనిద్దర్లో ఎవరు మగాడు?' అంది.

'నేనేలేవే' అంటూ జారిపోతున్న లుంగీని గట్టిగా చుట్టుకొంటూ పైకి లేచాడు వెంకట్రావు.

పెరటి తలుపులు చెవులు పెట్టి విన్నారు ఇద్దరూ. శబ్దం పక్క పెరట్లో నుంచి అనిపించింది.

'ఏమండీ.. ఈరోజు మధ్యాన్నం 'మొగుడు-ఉంచుకొన్నవాడు' సీరియల్ వచ్చింది కదా! అందులో అర్థరాత్రిపూట భార్యకు మెలకువ వచ్చి పెరట్లో శబ్దమయితే అతనే కదా అని వెళ్లి తలుపు తీస్తుంది. తీరా తలుపు తీస్తే సస్పెన్స్... ఎదురుగా మొగుడే... వెరైటీగా ఉంటుందని ఆ రాత్రి పెరట్లోనే ఆవిడ భర్తతో సరిపెట్టుకొంటుంది.'

'నువ్వు నోరు మూస్తావా వెధవ సీరియల్స్ గొడవ...' అంటూ వెంకట్రావు నెమ్మదిగా పెరటి తలుపులు తీశాడు. పండు వెన్నెల. ఏ దొంగాడూ లేడు. కాని శబ్దం మాత్రం వస్తూనే ఉంది.

'పక్కింటి పెరట్లోనండీ. పాపం సావిత్రి ఒంటరిగా ఉందో ఏమో'

'వాళ్లాయన శివరాం సావిత్రి ఇద్దరూ సాయంత్రం ఆటోలో వెళ్తుంటే చూశాను. ఆవిడ చేతిలో సూట్‌కేస్ కూడా ఉన్నట్టుంది.'

'నిజమేనేమో ఎవరూ లేరని ఏ దొంగో కన్నం వేస్తున్నాడు కాబోలు'

'ఏ సంగతీ నేను చూసి చెబుతాను. నువ్వు ఆ మధ్య గోడ దగ్గరగా కాస్త వంగు. నేను నీమీదకెక్కి అవతలివైపు తొంగి చూస్తాను.' వెంకట్రావు అన్నాడు.

'అదేం కుదర్దు. నువ్వు వంగు. నేను నీమీద నిలబడి చూస్తాను.'

"నువ్వు నా నడుంమీద నిలబడ్డావంటే నిమిషంలో నడుం విరిగి చస్తానే" దీనంగా అన్నాడు వెంకట్రావు.

'ఏమండీ మీ బరువెంత నా బరువెంత?'

'నేను అరవై నువ్వు నూట ఇరవై'

ఛెళ్‌మని వెంకట్రావు చెంపమీద ఒకటిచ్చింది కమలమ్మ. ప్రపంచం గిర్రున తిరిగినట్టయింది వెంకట్రావుకు. నిజం చెప్పడం నేరమా అన్నట్టు ఆమె వంక కాస్త తీక్షణంగా చూశాడు.


"సరి సరి వంటింట్లోకి వెళ్లి కుర్చీ తీసుకురా" హుకుం జారీ చేసింది. నిమిషంలో కుర్చీతో వెనక్కి వచ్చాడు వెంకట్రావు.

కుర్చీని గోడకి పక్కగా జరిపి గొంతు తగ్గించి వెంకట్రావు చెవిలో చెప్పింది కమలమ్మ. 'కుర్చీ వేసుకొని పక్క పెరట్లోకి తొంగి చూడవచ్చనే ఐడియా నాకెలా వచ్చిందో తెలుసా? ప్రతిమంగళవారం రాత్రి వచ్చే సీరియల్ 'కన్యకాని కన్య'లో హీరోయిన్ ఇలాగే తొంగి చూస్తుంది.'

వెంకట్రావు తల బాదుకొంటూ 'ముందు అక్కడ గొడవేమో చూడు' అన్నాడు. అడ్డుగోడమీద నుంచి అవతలికి తొంగి చూసిన కమలమ్మ కాస్సేపు చలనం లేనట్టు నిశ్చ్రాణంగా ఉండిపోయింది. ఆమె బొమ్మలాగా అయిపోవడం వెంకట్రావు గమనించాడు. కొన్ని క్షణాల తర్వాత కమలమ్మ పట్టు నిలవనట్టు స్పృహతప్పి నిలువునా జారిపడిపోయింది. పడిపోతున్న ఆమెను పట్టుకొనే ప్రయత్నం చేసిన వెంకట్రావు ముందు కిందబడ్డాడు. మీద ఆమె పడింది.

ఐదు నిముషాలపాటు గింజుకొని మీద పడిన కమలమ్మను పక్కకు నెట్టి వెంకట్రావు గబగబా కుర్చీమీదకెక్కి అవతలివైపు తొంగిచూశాడు. తొంగిచూసిన వెంకట్రావుకేమీ అర్థం కాలేదు. నిమిషంపాటు తదేకంగా అలాగే చూస్తూ ఉండిపోయాడు.

పక్కింటి పెరట్లో శివరాం నిలబడి ఉన్నాడు. ఒంటిమీద ఒక్క డ్రాయర్ తప్ప ఇంకో నూలుపోగు లేదు. అతని కళ్లు చింతనిప్పుల్లా కణకణా మెరుస్తున్నాయి. అతడి చేతుల్లోని గునపం నల్లగా, నిగనిగా నిటారుగా నిలబడిన నాగుపాములా మెరిసిపోతోంది. ఎదురుగా ఆరడుగుల పొడవు, మూడడుగుల వెడల్పుతో తవ్విన గొయ్యి. పక్కనే ఎర్రటి గుడ్డలో



## పాత్ర చిన్నదట!

బాలీవుడ్ దర్శకుడు రాహుల్ రావైల్ తీస్తున్న 'జో బోలే సో నిహాల్' (మాట్లాడినవారికి సంతోషమే) లో మల్లికాశెరావత్ ముందు చేయడానికి అంగీకరించి. తరువాత మానేసింది. "నాకు పబ్లిసిటీ అక్కర్లేదు. రాహుల్ ఆ పాత్ర కోసం ఎన్నుకున్నాడు కాని, అందులో ప్రత్యేకతేమీ నాకు కనిపించలేదు. సన్నీడియోల్ నన్నో రేప్ సీన్‌లో రక్షించి భుజాల మీదికెత్తుకుని, విధ్వంసంలో నాదే పాత్రం ఉంటుంది? అందుకే చేయనన్నా. ఇరవై మంది విలన్లని చితకబాదేయగానే పాకిస్తాన్ సేనంతా వెనక్కు మళ్లినట్లుగా అతని చిత్రాల్లో చూపించేది!" అంది. మరిలా మాట్లాడటం పబ్లిసిటీ కోసం కాదా?

మూటగట్టినదేదో వుంది. ఆ పక్కన ఒక బూడిదగుమ్మడికాయ, దానిమీద వెలుగుతున్న కర్పూరం.

శివరాం ఒక్కమారు హుమ్మన్నాడు. చూస్తున్న వెంకట్రావు వణికిపోయాడు. శివరాం పళ్లు పటపటమని కొరుకుతూ 'సా...వి...త్రీ...' అని బిగ్గరగానే అన్నాడు. గునపాన్ని పక్కన పడేసి కర్పూరం వెలుగుతున్న బూడిద గుమ్మడికాయను నెత్తిమీద పెట్టుకొని గొయ్యి చుట్టూ మూడుసార్లు తిరిగి నెత్తిమీద కాయను రెండుచేతుల్తో పైకెత్తి గోతిలోకి బలంగా విసిరాడు. ఆ వెంటనే మరో మారు 'సా...వి...త్రీ..' అంటూ ఎర్రటి మూటను బలమంతా ఉపయోగించి పైకెత్తి గోతిలోకి విసిరేసి మట్టితో గోతిని పూడ్చడం మొదలుపెట్టాడు. పూనకం వచ్చినవాళ్లా నాలుగు నిమిషాల్లో గోతిని పూడ్చేశాడు. పూడిపోయిన గోతిముందు ఒక నిముషంపాటు తలవంచుకొని నిలబడ్డాడు. అతని కళ్లలోనుండి జలజలమని నీరు కారడం చూసిన వెంకట్రావు గుండెలు తరుక్కుపోయాయి.

శివరాం ఆ పక్కనే కుంపట్లో ఉన్న కాక్టస్ మొక్కను (బ్రహ్మజెముడు జాతి) పీకి తాను పూడ్చిపెట్టిన గొయ్యి మధ్యలో నాటి మూడుమార్లు మగ్గుతో నీళ్లు పోశాడు. బృందావనం దగ్గరున్న వెలుగుతున్న ప్రమిదను తీసుకొచ్చి బ్రహ్మజెముడు మొక్కముందు పెట్టాడు.

ఒక దండం పెట్టి మళ్లీ పళ్లు పటపటమని కొరుకుతూ 'సా...వి...త్రీ..' అని అరచి గునపం భుజానా పెట్టుకుని వెనక్కి తిరిగి చూడకుండా లోపలికెళ్లి తలుపేసుకొన్నాడు.

తలతిరిగిపోయింది వెంకట్రావుకు. ఇంతవరకూ తను చూసిందేమిటో ఒక్కముక్క కూడా అర్థం కాలేదు. ఆ సరికే కమలమ్మ లేచి కూర్చుంది. వెంకట్రావు కళ్లు తుడుచుకొంటూ కుర్చీ ఎక్కి అవతలికి చూడమని కమలమ్మకు సైగ చేశాడు.


ఓపిక తెచ్చుకొని కుర్చీమీదకెక్కి చూసిన కమలమ్మకు పూడ్చిన గొయ్యి, మధ్యలో బ్రహ్మజెముడు మొక్క, ముందు వెలుగుతున్న ప్రమిద కనిపించాయి.

కాస్సేపు చూసి భారంగా నిట్టూరుస్తూ కిందికి దిగింది.

కుర్చీతోబాటు ఇద్దరూ లోపలికొచ్చి తలుపులేసుకొన్నారు.

'ఏం జరిగిందంటావు?' వెంకట్రావు భార్యను అడిగాడు.

'చెప్పుల శబ్దం' అనే వీక్లీ సీరియల్లో హీరోయిన్



**అలా జరుగుతుందంటే!**

అనేదిబాలీవుడ్ నటుడు అఫ్తాబ్ శివ్‌దసానీ అభిప్రాయం. ఇప్పుడిప్పుడే సోలో హీరోగా చేయగలననే ఆత్మవిశ్వాసాన్ని ప్రకటిస్తున్నాడు. తన వ్యక్తిగతజీవితాన్ని గురించి చెబుతూ, "నేనెవరినీ బోర్ కొట్టేంత మాట్లాడను. పార్టీలకు వెళతాను, క్రీడలు చూస్తాను, ప్రయాణాలు చేస్తాను, పరిశ్రమకు చెందని నా మిత్రులతో సరదాగా కాలం గడుపుతాను. నా జీవితంలోకి వచ్చిన అమ్మాయిలను గురించి కూడా నేనేం దాచలేదే! ప్రేమనేది జీవితానికి అవసరం. దానంతట అదే కలుగుతుంది. దాని కోసం నిరీక్షిస్తూ కూర్చోను" అంటున్నాడు అఫ్తాబ్. గట్టివాడే!

ప్రియుడితో కలిసి భర్తను ముక్కలు ముక్కలుగా నరికి ఇలాగే పెరట్లో పాతేస్తుందండి. అయితే ఆవిడ ఆ గోతి మీద తులసి మొక్కను నాటి దండం పెట్టుకొంటుంది. ఈ శివరామేమో బ్రహ్మజెముడు మొక్కను నాటాడు.'

'అంటే శివరాం భార్యను చంపేశాడు అంటావా? పాపం పెళ్లయి సంవత్సరం కూడా అయినట్లు లేదు.'

'ఇంకా సందేహమెందుకండీ... చంపడమే కాదు ముక్కలు ముక్కలుగా నరికేసి మూట కట్టాడు కదా!'

'శివరాం అంతపని చేశాడంటే నాకు నమ్మకం కుదరడం లేదు కమలా... ఒకవేళ నువ్వు చెప్పిందే నిజమైతే అతని ధైర్యానికి మెచ్చుకోవాలి.'

'ఎందుకూ?' దీర్ఘం తీసింది కమలమ్మ.

'భార్యను గొంతుపిసికి చంపాలని చాలామందికి ఉంటుంది. అందరూ ఆ పని చెయ్యగలరా' నెమ్మదిగా అన్నాడు వెంకట్రావు. కమలమ్మ ఆ డైలాగును పట్టించుకోలేదు. 'ఇప్పుడేం చేద్దాం?' అంది.

'పోలీసులకు ఫోన్ చేయాలి కదా' అన్నాడు వెంకట్రావు.

***

శివరాంలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. అంత శ్రమపడి అంత పెద్ద గొయ్యి తీసినా ఆ కష్టం తాలూకూ జాడలు కూడా లేవు అతని మొహంలో. బాత్రూంలోకెళ్లి శుభ్రంగా స్నానం చేశాడు. ఇస్త్రీ చేసిన పైజామా జుబ్బా తొడుక్కొని వంటింట్లోకి వెళ్లి కాఫీ కాచుకొని తాగాడు. ఇంటికి ఎదురుగా ఉండే పార్కులో కాస్సేపు హాయిగా కూర్చోవాలని అనిపించింది. ఇంటికి తాళం వేసి సిగరెట్టు వెలిగించుకొంటూ పార్కులోకి వెళ్లి కూర్చున్నాడు.

ఊహల్లో తేలిపోతున్న శివరాం కళ్లముందు ఒక లాఠీ, పోలీస్ టోపీ ప్రత్యక్షమయ్యాయి.

'ఏయ్ ఎవర్నువ్వు?'

సర్దుకొని కూర్చున్నాడు శివరాం. 'అదుగో అదే మా యిల్లు. నిద్రపట్టక ఇలా వచ్చి కూర్చున్నాను'

'ఎందుకు నిద్రపట్టలేదు?'

'ఎన్నో రోజులుగా కలలుగన్న ఒక మహత్కార్యాన్ని సాధించాను.'

'ఏమిటది?'

'చెప్పను'

'ఎందుకు చెప్పవు?'

'ఎవరికీ చెప్పకూడదని నా మీద నేనే ఒట్టేసుకొన్నాను.'

'నాకేదో అనుమానంగా ఉంది. మీ ఇంటికి పద. నీ ఐడెంటిటీ ఎంక్వయిరీ చెయ్యాలి.'

'మా ఇంట్లో ఎవరూ లేరు.'

'ఎవరూ లేరా? నువ్వొక్కడివే ఉంటున్నావా?'

'మా ఆవిడ పుట్టింటికి వెళ్లింది.'

'నమ్మమంటావా?'

'అది మీ ఇష్టం. నేను చెప్పేది నేను చెప్పాను.'

'ఎవర్తో మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడుతున్నావా?' పోలీసులంటే రవ్వంత భయం కూడా లేదా?'

'మైత్రీ సంఘాలు పెట్టి పోలీసులంటే భయపడొద్దని మీరేగా చెప్పారు.'

'డైలాగులు ఎక్కువవుతున్నాయి. ముందు పైకిలే' లాఠీ గాల్లోకి లేచింది.

***

కోర్టు హాలు నిశ్శబ్దంగా ఉంది.

జడ్జిగారు గంభీరవదనంతో తన ముందున్న ఫైల్లోని కాగితాలను తిప్పి బోనులో నిలబడ్డ శివరాం వంక ఒకమారు చూసి తల అడ్డంగా ఊపుతూ 'దారుణం... దారుణం' అని గొణిగాడు. ఆ తర్వాత అందరికీ వినిపించేటట్టు 'ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ని ప్రవేశపెట్టండి' అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. 'ఈ వ్యక్తిమీద మీరు చేస్తున్న అభియోగం ఏమిటి?' జడ్జి అడిగాడు.

ఇన్‌స్పెక్టర్ వినయంగా చెప్పాడు. 'యువరానర్.... ఈనెల తొమ్మిదవ తారీఖు రాత్రి ఈ శివరాం ఉంటున్న కాలనీ నుంచి మా స్టేషన్‌కు ఎవరో ఫోన్‌చేసి కాలనీలో ఒక వ్యక్తి తన భార్యను దారుణంగా హత్యచేసి తన పెరట్లోనే పాతిపెట్టాడని చెప్పాడు. అతడు చెప్పింది అంతవరకే. వెంటనే మా పోలీసులు రంగంలోకి దిగారు. రాత్రికి రాత్రే ఈ శివరాంను అరెస్ట్‌చేసి తీసుకొచ్చారు. ఎన్ని రకాలుగా ప్రశ్నించినా ఇతను పెదవి విప్పడం లేదు.'

'పెరట్లో శవాన్ని పాతిపెట్టాడని అభియోగం ఉంది కదా... తవ్వి చూశారా?"

ముఖం పాలిపోయింది. 'క్షమించండి యువరానర్ ఆ పని మేం చేయలేకపోయాము.'

జడ్జిగారు కనుబొమలు కలిపాడు. 'ఎందుకని?'

ఆ పెరట్లోకి అడుగుపెట్టలేకపోయాము'.

'ఎందుకని?'

'ఆ పెరటి నిండా ఒక బ్రహ్మజెముడు పొద ఉంది యువరానర్. పెరట్లో ఒక్క అంగుళం కూడా ఖాళీ లేకుండా ఆ జెముడు అల్లుకుపోయింది.'

'పెరట్లో ఖాళీలేకుండా బ్రహ్మజెముడు అల్లుకుపోయుంటే ఇక ఈ నిందితుడు గొయ్యి తవ్వింది ఎక్కడ? పెళ్లాన్ని పూడ్చిపెట్టింది ఎక్కడ? అసలు ఈ ఇన్‌ఫర్మేషన్ ఎవరిచ్చారో వాళ్లను ప్రవేశపెట్టండి.'

వెంకట్రావు, కమలమ్మ జంటగా బోనులోకి వచ్చారు.

'మీ ఇద్దర్లో ఎవరు మాట్లాడుతారు?' జడ్జిగారు అడిగాడు.

'మా ఆవిడ ఉండగా నేను నోరు తెరవనండీ' వెంకట్రావు చప్పున సమాధానం చెప్పాడు.

'నువ్వు చెప్పమ్మా ఏం చూశావో'

'అయ్యగారూ ముందు నేనో చిన్న ప్రశ్న అడుగుతాను చెబుతారా' కమలమ్మ అంది.

'ఏమిటో అడుగు...'

"పోలేరమ్మ" డైలీ సీరియల్ చూస్తున్నారా మీరు?

'చూస్తే...'

'దాంట్లో అత్త కొడల్ని చంపించడానికి ఒక మాంత్రికుడి దగ్గరికి వెళ్తుంది కదా..'

'వెళ్తే...'

'ఆ మాంత్రికుడి దగ్గర ఎన్ని మాయలున్నాయో అన్ని మాయలున్నాయి అయ్యగారూ... మా కళ్లముందే మేం చూస్తూ ఉండగానే గొయ్యి తవ్వాడు. సావిత్రమ్మను నరికి కట్టిన మూట ఎర్రగా రక్తం కారుతూ ఉందంటే నమ్మండి. సావిత్రి అని ఈయనగారు వల్లు వట వటమని కొరుకుతూ ఉంటే చూళ్లేక నేను తెలివి తప్పి పడిపోయాను. మిగతాది మా ఆయన చూశాడు.'

వెంకట్రావు గొంతు సవరించుకొని చెప్పాడు. 'శవాన్ని గోతిలో వేసి పూడ్చి పెట్టి దానిమీద బ్రహ్మజెముడు చెట్టు నాటాడు. నా కళ్లతో నేను చూశాను. ఆ తర్వాత శివరాం ఇంట్లోకి వెళ్లిపోయాడు. మేం పోలీసులకు ఫోన్ చేశాం. తెల్లారి మా పెరట్లోకి వెళ్లాలన్నా మాకు భయం వేసింది. రాత్రి శివరాం నాటిన మొక్క తెల్లారేసరికి అంత పెద్దగా ఎలా అల్లుకుపోయిందో మాకు అర్థం కావడం లేదు.'

వాళ్లిద్దరూ బోను దిగిపోయారు. ఇన్‌స్పెక్టర్ మళ్లీ వచ్చి నిలబడ్డాడు. 'యువరానర్ బ్రహ్మజెముడు పొదను తొలగించడానికి మేం చెయ్యాల్సిన ప్రయత్నాలన్నీ చేసేశాం. దాన్ని నరికితే క్షణంలో కొమ్మలు మొలుస్తాయి. పెట్రోలు పోసి తగలెడితే బూడిదలోంచి మళ్లీ మొక్క మొలుచుకొస్తుంది. క్షుద్రవిద్యలతో లోకాన్ని మోసం చేస్తున్నాడనే అభియోగం కూడా ఈ శివరాం మీద నమోదు చేస్తున్నాం.'

జడ్జిగారు శివరాం వంక తిరిగాడు. 'ఆఖరు మారుగా అడుగుతున్నాను. నీమీద మోపబడిన నేరానికి నువ్వు సంజాయిషీ ఇచ్చుకుంటావా? లేక నీ మౌనంతో నేరం ఒప్పుకొంటున్నావని శిక్ష వేయమంటావా?'

మొట్టమొదటి మారుగా గొంతు విప్పాడు శివరాం. 'యువరానర్... నా కేసు ఇంత జటిలమవుతుందని నేను కూడా అనుకోలేదు. నేను చేసింది నేరం కాదని నేననుకొంటున్నాను. కాని మీరంతా నేరం అంటున్నారు కాబట్టి మీరనే ఆ నేరాన్ని ఎందుకు చేయాల్సి వచ్చిందో నేను వివరంగా చెబితేగాని తమకు అర్థం కాదు.


నేను ఒక చిన్న ఆఫీసులో గుమాస్తాని. నా ఆదాయం పరిమితం. నాకు తగిన సంబంధాన్ని మావాళ్లు కుదిర్చారు. సావిత్రిని పెళ్లిచూపుల్లో చూసినప్పుడు నాకు సరిగ్గా సరిపోయే వ్యక్తి అనుకొన్నాను. కాని మా శోభనం రాత్రే ఆవిడ సంగతి అర్థమైపోయింది.'

శివరాం గొంతు బొంగురుపోయింది. అతనికి నీళ్లు ఇవ్వమని జడ్జిగారు ఆదేశించారు. కోర్టు హాలంతా చెవులు రిక్కించి వింటోంది.

నీళ్లు తాగి గొంతు సవరించుకొన్న శివరాం మళ్లీ మొదలు పెట్టాడు. 'యువరానర్ మాకు మొదటిరోజు శోభనం జరగలేదు.'

'ఎందుకని?' జడ్జిగారు ఉత్సాహంగా ముందుకు వంగి అడిగాడు.

'రాత్రి తొమ్మిది గంటలకు మమ్మల్ని గదిలోకి పంపారు. అన్ని ఏర్పాట్లు సవ్యంగా ఉన్నాయి. స్వీట్లు, పాలతోబాటు టి.వి. కూడా ఉంది. మా ఆవిడ లోపలికి ఎంటరవగానే టి.వి. ఆన్ చేసింది. ఏదో ఛానళ్లు తిప్పుతుండగా 'తొమ్మిదయిందిగదా! న్యూస్ పెట్టు' అన్నాను.



కాదండీ ఇంకో ఛానల్లో 'నలిగితే నూలుచీర' సీరియల్ వస్తోంది. దాన్ని చూసేసిన తర్వాత మీ ఇష్టం అంది. సరే అని నేను పడకమీద నడుం వాల్చాను. రాత్రి పన్నెండింటికేమో మెలకువ వచ్చింది. నేను కదలడం చూసి సావిత్రి టి.వి.ని టక్కున కట్టేసింది. నేను మళ్లీ నిద్రలోకి జారుకున్నాను.

యువరానర్ ఆ రోజు నుండి మొన్నటివరకూ ఇదే పరిస్థితి.

తెల్లారిపూట 'ఆఫీసుకు టైమవుతోంది క్యారియర్ సర్దు సావిత్రీ' అంటే 'ప్లీజ్ ప్లీజ్ వంటింట్లో అంతా రెడీగా ఉంది. ఈ పూటకు మీరే సర్దుకోండి. ఈ లోపల నేను 'తలుపు తెరవండి మీ మనసు విప్పండి' సీరియల్ చూసేస్తాను అంటుంది.

సాయంత్రం ఇంటికి వచ్చి కాఫీ అంటే 'ఫ్లాస్కు'లో అంటుంది.

టిఫిన్ అంటే 'ఈ సీరియల్ వెయ్యి ముప్పై రెండో ఎపిసోడ్ వస్తోందండి. మధ్యలో అడ్వర్‌టైజ్‌మెంట్లు వచ్చినప్పుడు టిఫిన్ పెడతాను' అంటుంది.

యువరానర్... నా జీవితం ఇలా నాలుగు ఛానళ్లు నలభై సీరియళ్లతో కాలిపోయింది. ఎవరికైనా సహనం ఉంటుంది. పెళ్లయిన సంవత్సరానిక్కూడా శోభనానికైనా నోచుకోని నా జీవితం మీద నాకే విరక్తి పుట్టింది. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటా అని తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను.

పకడ్బందీగానే ప్లాన్ చేశాను. కాని దురదృష్టవశాత్తు మా పక్కింటి దంపతులు వెంకట్రావు కమలమ్మగార్ల కంటబడి పట్టుబడిపోయాను. తలవంచుకున్నాడు శివరాం.

'అయితే కమలమ్మ వెంకట్రావుగార్లు చెప్పింది నిజమేనన్నమాట' జడ్జిగారు అడిగారు.

శివరాం మళ్లీ ఆవేశంతో ఊగిపోయాడు. 'అక్షరాలా నిజం యువరానర్! దాన్ని ముక్కలు ముక్కలుచేసి పాతిపెట్టాను. ఈ చేతుల్తో... నా ఈ రెండు చేతుల్తోనే ఈ నేరం చేశాను. చూసినప్పుడల్లా అది గుర్తురావాలని గోతిమీద బ్రహ్మజెముడు చెట్టు నాటాను. ఆ రాకాసి అంతం అవుతుందని ఆశపడ్డాను.'

హాల్లో కలకలం చెలరేగింది. జడ్జిగారు సుత్తి కొట్టారు. 'అయితే నీ భార్య సావిత్రిని నువ్వే చంపానని నేరం ఒప్పుకుంటున్నావు కదూ!' అడిగాడు.


చప్పున తల పైకెత్తాడు శివరాం 'ఇంతచెప్పినా మీరు మళ్లీ భార్యను చంపానంటారేమిటండీ' అని భోరుమన్నాడు.

తల పట్టుకోవడం జడ్జివంతయింది. 'నీ భార్యను నువ్వు చంపలేదా? ఇంతవరకూ నువ్వే కదయ్యా చెప్పింది ముక్కలు ముక్కలు చేసి పాతి పెట్టానని.'

'అది నిజమే యువరానర్... కాని నేను ముక్కలు ముక్కలు చేసింది నా భార్య సావిత్రిని కాదు.'

జడ్జి ముఖం కళ తప్పింది 'ఇంకెవరిని?' కరుగ్గా అడిగాడు.

నింపాదిగా చెప్పాడు శివరాం 'టి.వి.ని... నేను ముక్కలు ముక్కలు చేసి పాతిపెట్టింది మా టి.వి.ని. అంతలోతు గోతిలో పాతిపెట్టినా టి.వీ.



ఛానళ్లు చావలేదు. బ్రహ్మజెముడు చెట్టులాగా మొలుచుకొచ్చింది టీవీ ఛానల్లే. ఇప్పటికీ ఆ బ్రహ్మజెముడు మా బెడ్‌రూంలోకి కూడా అల్లుకుపోయి ఉంటుంది.'

వేగంగా రెండువార్లు ఊపిరిపీల్చి వదిలిపెట్టాడు జడ్జిగారు 'మళ్లీ చెప్పు' అన్నాడు.

'యువరానర్... నా సమస్య ఏమిటి? నా భార్య అస్తమానం టి.వి. గోలలో పడిపోయి నన్ను పట్టించుకోవట్లేదు. దీనికి పరిష్కారం ఏమిటి? నా భార్యను చంపెయ్యడమా? కానే కాదు. టీ.వీ.ని మా ఇద్దరి మధ్యా లేకుండా చేయాలి. ఆ పనే చేశాను.'

జడ్జిగారి ముఖంలో నవ్వు పొడుచుకొచ్చింది. 'భలేవాడివయ్యా... టీవీని ముక్కలు చేసి పాతిపెడితే మీ ఆవిడ ఇంకో టీ.వీ. కొనుక్కోదా...'

'మాది మధ్యతరగతి కుటుంబం సార్. టీ.వీ. కొనాలంటే పది పన్నెండు వేలన్నా కావాలిగా... దానికెట్లాగైనా ఆర్నెల్లయినా పడుతుంది. ఈ లోపల మా శోభనం అయిపోతుంది గదా!'

కోర్టు హాలంతా నవ్వుల్తో దద్దరిల్లిపోయింది.

జడ్జిగారు ఆర్డర్ చెప్పి 'ఇంతకూ మీ ఆవిడ ఎక్కడుంది?' అన్నాడు.

'పుట్టింట్లో' అని చేతి గడియారం వంక చూసి 'సరిగ్గా ఈ సమయానికి 'బిచ్చగాడి పెళ్లాం. కోటీశ్వరమ్మ' సీరియల్ చూస్తూ ఉంటుంది.' అన్నాడు.

'మీ అత్త గారింట్లో ఫోన్ ఉందా?'

'ఉందండి.'

'నంబర్ చెప్పు. ఇన్‌స్పెక్టర్! ఆ నంబరుకు డైల్ చేసి 'నీ భర్త పోలీసు కస్టడీలో ఉన్నా'డని చెప్పు ఏమంటుందో అన్నాడు జడ్జిగారు.

ఇన్‌స్పెక్టర్ శివరాం చెప్పిన నంబరుకు ఫోన్ చేసి సావిత్రిని ఫోన్ దగ్గరికి పిలిపించి విషయం చెప్పి వెంటనే ఫోన్ పెట్టేశాడు.

'ఎందుకు ఫోన్ పెట్టేశావు?' జడ్జిగారు అడిగాడు.

'పది నిమిషాల తర్వాత చెయ్యమంది సార్.'

అందరూ పది నిమిషాల ఓపిగ్గా వెయిట్ చేశారు. ఇన్‌స్పెక్టరు మళ్లీ నంబరు డయల్ చేయబోతుండగా 'పది నిమిషాల తర్వాత మాట్లాడతాను అని ఎందుకందో ముందు తెలుసుకో' అన్నాడు.

అవతలి ఫోన్లో సావిత్రి సమాధానం చెప్పింది. 'ఎందుకేమిటి సార్ పది నిమిషాల తర్వాత సీరియల్లో అడ్వర్‌టైజ్‌మెంట్లు వేస్తారు కదా అప్పుడు మాట్లాడుకోవచ్చని.'

ఇన్‌స్పెక్టర్ ద్వారా సావిత్రి చెప్పిన సమాధానం వినగానే జడ్జిగారు జుట్టు పీక్కోబోయి బలవంతంగా నిగ్రహించుకొని 'వెంటనే బయలుదేరి రమ్మని చెప్పు లేకుంటే నీ భర్తకు ఉరిశిక్ష పడుతుందని కూడా చెప్పు' అన్నాడు.

జడ్జిగారు చెప్పినట్లే ఇన్‌స్పెక్టర్ ఫోన్లో సావిత్రికి చెప్పి ఆమె సమాధానం విని ఫోన్ పెట్టేశాడు.

'ఏమంది?' ఈ మారు కాస్త నింపాదిగా అడిగారు జడ్జిగారు.

ఇన్‌స్పెక్టర్ తల వంచుకొని 'ఇప్పటికిప్పుడే బయల్దేరితే ఇవాళ నాలుగు సీరియళ్లు మిస్సవుతాయట. పైగా ఒకటి ఈ రోజు మంచి సస్పెన్స్‌లో ఉందట. కోడలు అత్తగారికి విషం పెట్టే సీను చూసేసి లాస్ట్ బస్‌కు బయల్దేరి వస్తానంది.'

జడ్జిగారు నిగ్రహించుకోలేకపోయారు. అమర్యాద అయినా కోర్టు హాల్లోనే జుట్టు పీక్కున్నారు.

శివరాం ఒక పిచ్చినవ్వు నవ్వాడు. ■